క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన విజిలెన్స్ ఎస్పీ



కలెక్టర్‌తో విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విజిలెన్స్ ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బర్ల ప్రసాద్ శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ని ఆయన కార్యాలయంలో గౌరవ పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు.

ఎచ్చెర్ల ఎస్సై బాధ్యతల స్వీకరణ



సందీప్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎస్సైగా నియమితులైన వెలిచేటి సందీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జె.ఆర్.పురం ఎస్సై చిరంజీవి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఉన్నట్లు సందీప్ చెప్పారు. గతంలో ఎచ్చెర స్టేషన్‌లో ఈయన పనిచేసి ఉన్నారు.

బాలల సంక్షేమానికి కృషి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: బాలల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు అఫ్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంజూరి ఫిలిప్ తిమోతి అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం బాల్యవివాహాలకు నివారణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఫ్‌హోల్డ్ సంస్థ, యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్టు సంయుక్తంగా బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషిచేస్తాయన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కో–ఆర్డినేటర్ జి.డేవిడ్‌రాజు, మన్యం జిల్లా పార్వతీపురం కో–ఆర్డినేటర్ పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో 100 గంటల భజన



భజన చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని సత్యసాయి పెద్ద మందిరంలో శుక్రవారం గోరువానిపేటకు చెందిన సత్యసాయి భక్తులు 100 గంటల పాటు భజన చేశారు. కార్యక్రమంలో పెద్దమందిరం కన్వీనర్ మురళీకృష్ణ, భజన్స్ ఇన్‌చార్జి వినోద్, గోరువానిపేట కన్వీనర్ సూర్యనారాయణ, యూత్ కో–ఆర్డినేటర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి వీసీ అభినందన



శిరీషను అభినందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయిలో కళాశాల, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు విశాఖకు చెందిన రామకృష్ణ మిషన్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థిని ప్రతిభ కనపరిచింది. బీఈడీ (స్పెషల్) చదువుతున్న జామి శిరీష స్వామి వివేకానంద–విశిష్టమైన భారతీయ సంస్కృతి అనే అంశంపై రాసిన వ్యాసానికి నాలుగో బహుమతి లభించింది. దీంతో శిరీషను వీసీ కె.ఆర్.రజని శుక్రవారం తన చాంబర్లో అభినందించారు. కార్యక్రమంలో విద్యా విభాగం సమన్వయకర్త హెచ్. సుబ్రహ్మణ్యం, జె.ఎల్. సంధ్యారాణి ఉన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



నాటిన విత్తన మొలకలను పరిశీలిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: బాతువ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు వీలుగా సేంద్రియ ఎరువులతో కూడిన కూరగాయలను సాగు చేయాలని భావించారు. ప్రధానోపాధ్యాయురాలు పి.దుర్గాభవాని పర్యవేక్షణలో బెండ, వంకాయలతో పాటు ఇతర కూరగాయాలు సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా కూరగాయల సాగుపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌వీ సాయిరామ్‌కుమార్, ఎం.చిన్నారావు, కె.ఈశ్వర్‌సత్యన్నారాయణ, బి.దేవి, ఎస్.మురళీ. కె.మాధవి, బి.గౌరీశ్వరరావు, పి.మాణిక్యాలరావు, ఎం.రమణ ఉన్నారు.

ప్రాక్టికల్స్‌లో ఫెయిల్!



పరికరాలు లేని ఫిజిక్స్ ల్యాబ్



ఎక్స్‌పైర్ కెమికల్స్, పగిలిన ట్యూబ్‌లు, గాజు వస్తువులు

- ల్యాబ్ ఉన్నా పరికరాలు లేక విద్యార్థులు ఇక్కట్లు
- పెదపాడు అంబేడ్కర్ గురుకులంలో తప్పని అవస్థలు

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో నాబార్డు నిధులతో నిర్మించిన ప్రాక్టికల్స్ ల్యాబ్‌లో పరికరాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఇంటర్మీడియట్ కోర్సు ప్రారంభమై నాలుగు బ్యాచ్‌లు పూర్తయినా ప్రాక్టికల్స్‌కు మాత్రం మోక్షం కలగడం లేదు. అరకొర వస్తువులు, ఎక్స్‌పైరీ డేట్ పూర్తయిన కెమికల్స్‌తో నామమాత్రంగానే ప్రాక్టికల్స్ చేస్తున్నారు. కాలేజీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ పేరిట నాలుగు ల్యాబ్‌లు నిర్మించారు. అందులో ఉండాల్సిన కెమికల్స్, స్పోర్టర్స్, స్లైడ్స్, స్పెషిమన్స్ (రకరకాల పాములు, కప్పలు, తేళ్లు) లేవు. దీంతో ప్రాక్టికల్స్ సమయంలో ఆదిత్య డిగ్రీ కళాశాల గానీ, శ్రీ చైతన్య కళాశాల నుంచి తెప్పించి విద్యార్థులకు చెప్పించడం నిత్యకృత్యంగా మారింది. పబ్లిక్ ప్రాక్టికల్స్ సమయంలోనే కాకుండా నిత్యం జరగాల్సిన ప్రాక్టికల్స్ తరగతుల సమయంలోనూ పరికరాలను అద్దెకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పరికరాలు సమకూర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

పుస్తకాలే దిక్కు..



పుస్తకాల్లోని జువాలజీ, బోటనీ బొమ్మలను చూసి ప్రాక్టికల్స్‌పై అవగాహన పెంచుకుంటున్నాం. మా ల్యాబ్‌లో స్పోర్టర్స్, స్పెషిమన్స్ ఏమీ లేవు. మరో ఏడు నెలల్లో పబ్లిక్ ప్రాక్టికల్స్ రానున్నాయి. ఈలోగా సన్నద్ధం కావాలి.

– శ్రీవల్లి, బైపీసీ విద్యార్థిని

అరకొర వస్తువులతోనే..



ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌ను అరకొర వస్తువులతోనే చేస్తున్నాం. ట్యూబ్‌లు, గ్లాసులు పగిలిపోయాయి. ఎక్స్‌పైర్ అయిన కెమికల్స్‌తోనే ప్రాక్టికల్స్ చేస్తున్నాం. మాకు పూర్తిస్థాయిలో పరికరాలు అందుబాటులోకి తేవాలి.

– రమ్య, ఎంపీసీ విద్యార్థిని

ఉన్నతాధికారుల దృష్టికి..



నాలుగు ల్యాబ్స్‌లో ప్రాక్టికల్స్ చేయించడానికి పరికరాలు, ఇతరత్రా వస్తువులు ఏమీ లేవు. గత ఏడాది ప్రాక్టికల్ ఖర్చుల నిమిత్తం ఒక్కో ల్యాబ్‌కు రూ.5వేలు చొప్పున రూ.20వేలు మంజూరయ్యాయి. అరకొర వస్తువులతోనే ప్రాక్టికల్స్ చేయిస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– మార్పు జ్యోతి, ప్రిన్సిపాల్

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎన్‌వైకే అధికారి వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని నెహ్రూ యువజన కేంద్రం అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. బలగ మున్సిపల్ హైస్కూల్‌లో రూరల్ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ (నెహ్రూ యువకేంద్ర అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏ.వి మురళీకృష్ణ, జ్యోతిరావుపూలే ఆల్ ఇండియా ఓబీసీ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రటరీ రౌతు శంకరరావు, ఎన్.వై.కె గణాంకాధికారి కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు రౌతు సుమతి మోహనరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఎ.పున్నయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం గ్రామ సమీపంలోని జీడితోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్, సిబ్బంది శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. ఈ సందర్భంగా 9,700 రూపాయలను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.జి.నాగోజీ తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో నాక్ త్రిసభ్య బృందం కళాశాలను సందర్శించింది. అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాలు పరిశీలించి ఏ గ్రేడ్‌ను మంజూరు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రావాడలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రణస్థలం: వరిలో చీడ పీడల నివారణకు ప్రకృతి వ్యవసాయమే మేలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ ఆధికారి హేమ సుందర్‌రావు, మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణలు అన్నారు. రావాడ, బంటుపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎకరానికి పది లీటర్ల జిల్లేడు ఆకుల ద్రావణాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలని సూచించారు. ఇలా చేస్తే వరిలో వచ్చే పొటాష్, సూక్ష్మ పోషకాల లోపాలను, రసం పీల్చే పురుగులను నివారించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో వీపీఏ సంధ్య, ప్రకృతి వ్యవసాయ సలహాదారులు కొయ్యాన రాంబాబు, గంట్యాడ ఎసుబాబు, గిడిజాల సూర్యకాంతం ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



జి.సిగడాం: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు పౌష్టికాహారంతోపాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో తీసుకోవాలని జి.సిగడాం మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. మోడల్ స్కూల్‌లో పౌష్టికాహార మాసోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనేక వ్యాధుల నుంచి బయటపడవచ్చున్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు, బాల్యవిహహాలపై అవగాహన అవసరమన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వ్వాడీ కార్యకర్తలు మహదాస్యం రాధిక, సువ్వాడ రమాదేవి, చిల్లా భారతి, ఉపాధ్యాయులు, ఎంఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



గూనపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరని గూనపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా శుక్రవారం 33వ డివిజన్ గూనపాలెం సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జిలు దీర్ఘాసి హరి, పొట్నూరు రాజు, నడగాన విజయ, వై.బాలామణి, ఆశావర్కర్ అమ్మాజీ, అంగన్‌వాడీలు టి.రాజేశ్వరి, ఆదిలక్ష్మి, హైమరత్నం, ఆర్‌పీలు జ్యోతి, బి.గీతామాధురి, అరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు



శ్రీకాకుళం పాతబస్టాండ్: సీతారాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం బాధాకరమని యావత్ భారతావనికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సీహెచ్.రాజు అన్నారు. నగరంలో శుక్రవారం సీతారాం సంతాప సభ ఏర్పాటు చేసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే బడుగు, బలహీనవర్గాల కోసం సీతారాం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని శ్రీకాకుళం న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఈశ్వరరావు అన్నారు. ఏచూరి మరణం సందర్భంగా బార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘంటించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు చమల్ల నర్సింహమూర్తి, పొన్నాడ వెంకటరమణ రావు, మామిడి క్రాంతి, పైడి లక్ష్మీపతి, కొమ్ము రమణమూర్తి, జి.వాసుదేవరావు, విజయకుమార్, ధర్మాన నీలన్నాయుడు, ఈతారాజు, భవానీ ప్రసాద్, మురళీకృష్ణ, కూన అన్నంనాయుడు, దుంపల రమణారావు, డొంకాన ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



రణస్థలం: రెడ్డీస్ ల్యాబొరేటరీ వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

రణస్థలం: కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం వామపక్ష లౌకిక, ప్రజాస్వామ్యశక్తులకు, శ్రామిక వర్గానికి తీరనిలోటని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో డాక్టర్ రెడ్డీస్, శ్యాంపిస్టన్స్ ప్లాంట్–2 పరిశ్రమ, సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ సీతారాం ఏచూరి సంతాప సభలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2011లో డాక్టర్ రెడ్డీస్ కార్మికులు నిర్వహించిన సమ్మె పోరాటానికి సీతారాం ఏచూరి వచ్చి సంఘీభావం తెలిపి అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శి, సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీ లేని యుద్ధం చేసిన పోరాట యోధుడని కొనియాడారు. విద్యార్థి దశ నుంచి మూడు దశాబ్ధాలుగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోసిన ఆయన మరణం కష్టజీవులకు నష్టమని అన్నారు. పార్లమెంట్‌లో ఏచూరి చేసిన ఒక్కో ప్రసంగం ఒక్కో వ్యాసమని.. ఇంతటి గొప్పవారు మన మధ్య నుంచి దూరం కావడం అత్యంత బాధాకరమని అన్నారు. అయనకు సంతాపంగా పైడిభీమవరం సీఐటీయూ కార్యాలయం వద్ద కార్మిక జెండాను కిందకు దించారు. సంతాప సభలో పలు పరిశ్రమల నాయకులు పి.రామకృష్ణ, బి.సురేష్, టి.వీర్రాజు, పున్నాన శ్రీను, సత్యన్నారాయణ, ఎం.అప్పలనర్సయ్య, ఎన్.నాగేశ్వరరావు, జీరు రాము ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం చవితి మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. గణపతి ఆలయాల్లో కలశారాధనలు, క్షీరాభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: బర్మాకాలనిలో సామూహిక కుంకుమ పూజలు



శ్రీకాకుళం రూరల్: బలగలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



గార: కుమ్మరిపేటలో కుంకుమ పూజలు



రణస్థలం: జె.ఆర్.పురంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఇంటితోటల పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: సులభమైన సేంద్రియ పద్ధతి ద్వారా ఇంట్లోనే కూరగాయలు పండించుకోవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కొయ్యాన భాగ్యలక్ష్మీ అన్నారు. పెద్దపాడులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో ఇంటితోటల పెంపకంపై మూడురోజుల శిక్షణను శుక్రవారం ఏఓఎల్ రాష్ట్ర ప్రతినిధి దార్లపూడి రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓఎల్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు, హార్టికల్చర్ సస్యరక్షణ శాస్త్రవేత్త ఎస్.అనూషా, డీడీసీ సభ్యులు బి.వి.రవిశంకర్, మీడియా కో–ఆర్డినేటర్ కె.ఎస్.జె. మూర్తి, కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: ఆసియా పసిఫిక్ సభ్యదేశాల చైర్మన్‌గా ఎన్నికైన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోసం శుక్రవారం జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 40 దేశాలతో కూడిన సభ్యదేశాలకు ప్రతినిధిగా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ నిజాముద్దీన్, బహదూర్ బాషా, ఎండీ రఫీ, మహమ్మద్ రఫీ, హుస్సేన్, అదిల్, రెహ్మాన్, నాని, కరీమ్, షఫీ, రషీద్, ఇజాజ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు ఉద్యోగుల వీడ్కోలు



జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావుకు వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగ సంఘ నేతలు

అరసవల్లి: జిల్లా పరిషత్ వంటి అతిపెద్ద మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సీఈఓ వెంకటేశ్వరరావు ముందుండేవారని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిలారి నారాయణరావు కొనియాడారు. సీఈఓ వెంకటేశ్వరరావును మాతృశాఖ రెవెన్యూకు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు రావడంతో శుక్రవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ యూనిట్ అధ్యక్షురాలు జయమ్మ, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



ఆందోళన నిర్వహిస్తున్న నర్సులు

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో నర్సింగ్ వ్యవస్థకు తీరని నష్టం కలుగుతోందని ఏపీ నర్సెస్ స్ట్రగుల్స్ కమిటీ సభ్యులు వేదవతి, సంతోష్, శరత్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రిమ్స్ ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎన్‌ఎం నుంచి జీఎన్‌ఎం ఇంటెన్సిఫైడ్ వారికి స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

సర్వీస్‌లో ఉన్న ఏఎన్‌ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీఓ 115 తమకు నష్టం కలిగించేదిగా ఉందన్నారు.

కోపాన్ని నియంత్రించుకోవాలి



సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: కోపం ఎంతటివారినైనా నాశనం చేస్తుందని పి.వి.ఎస్.సాయిప్రసాద్ అన్నారు. నగరంలోని ఉపనిష్మందిరంలో సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా 'కాశీఖండం–వ్యాసుని భిక్ష' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీలో తనకు భిక్ష లభించలేదని వ్యాసుడు కాశీనగరాన్ని శపించడానికి ప్రయత్నిస్తే అన్నపూర్ణాదేవి వచ్చి భిక్షను వేసి, ఆయనను కాశీనుంచి వెలివేసిందని చెప్పారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, కోమలరావు, ఎన్.నరసింహమూర్తి, విశ్వేశ్వరరావు, డి.జి.పట్నాయిక్, అనూరాధ, సరస్వతి, వెంకటరమణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సోలార్ సూర్యఘర్‌పై అవగాహన సదస్సు నేడు



ఎస్.కృష్ణమూర్తి, ఎస్ఈ

అరసవల్లి: పీఎం సోలార్ సూర్య ఘర్ పథకం ఎంతో ప్రయోజనకరమని విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ వద్ద కంపోస్టు కాలనీ డౌన్ వద్ద విద్యుత్ వినియోగదారులతో శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు. సందేహాలను నివృత్తి చేసేందుకు సోలార్ ప్యానల్ కాంట్రాక్టర్లు కూడా పాల్గొంటారని పేర్కొన్నారు.

3వ తరగతి నుంచే హిందీ బోధించాలి

శ్రీకాకుళం: ద్వితీయ భాష హిందీని 3వ తరగతి నుంచే బోధించాలని హిందీ దివాస్ ఉత్సవ సమితి సమన్వయకర్త మందపల్లి రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచి హిందీ బోధన జరుగుతోందని, ప్రభుత్వ పాఠశాల్లో కనీసం 3వ తరగతి నుంచైనా బోధన ప్రారంభించాలని కోరారు.

బమ్మిడివానిపేటలో పారిశుధ్య పనులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పొన్నాం పంచాయతీ బమ్మిడివానిపేటలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కాలువల్లో పూడికలు తొలగించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

షాపుల పరిశీలన

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వెనుకన జిల్లా పోలీస్ శాఖకు సంబంధించిన రెంటల్ షాపులను శుక్రవారం రాత్రి ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. వివరాలను సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు.